'మామిడి' కోసం ఎదురుచూపులు

ఏప్రిల్ రెండో వారమైనా మార్కెట్లలో కనిపించని మామిడికాయలు

జనవరిలో రావాల్సిన పూత, పిందె ఏప్రిల్ రెండోవారంలో కనిపిస్తున్నది

వాతావరణ మార్పులతో మామిడి దిగుబడిలో ప్రతికూల ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారమైనప్పటికీ.. మార్కెట్లలో మామిడికాయల సరఫరా లేదు. దీంతో మామిడి పండ్ల కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. వేసవి వచ్చిందంటే మార్చి నుంచే మార్కెట్లన్నీ మామిడికాయలతో నిండి ఉండేవి. కానీ, దానికి భిన్నంగా ఈ ఏడాది సీజన్ కనిపిస్తున్నది. సాధారణంగా జనవరిలోనే మామిడి కాయలు కాయడం ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి మూడో వారం నుంచి మార్కెట్‌లోకి వస్తుంటాయి. కానీ, ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారమైనా మార్కెట్‌లోకి నాణ్యమైన మామిడిపండ్లు రావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం గత సెప్టెంబర్‌లో కురిసిన వానలే అని ఉద్యాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పూతకు వచ్చే ముందు మామిడితోటల్లో బెట్ట వాతావరణం ఉండాలి. వాస్తవంగా జూన్, జూలైలో వచ్చే వానలతోనే కొత్త చిగుళ్లు వస్తాయి. రెండు నెలల తర్వాత చలి వాతావరణంతో ఆ చిగుళ్లను పూతగా మార్చుకుంటుంది. అప్పుడు కావాల్సిన నీరు పెట్టి ఎరువును వేస్తారు. సాధారణంగా ఆగస్టు నుంచి నీరు పెట్టడం నిలిపివేస్తారు. నవంబర్, డిసెంబర్‌లో పూత మొదలవుతుంది. ఈసారి భిన్నంగా సెప్టెంబరులో వానలు వచ్చాయి. దీంతో చలి కూడా అంతగా లేకపోవడంతో పూత తగ్గిపోయింది. నవంబర్, డిసెంబర్‌లో రావాల్సిన పూత కాస్తా.. జనవరి, ఫిబ్రవరి, మార్చిలోనూ వచ్చింది. దీంతో వేడి ఎక్కువై పూత రాలింది. ఈ ప్రభావం కాతపై పడడంతో మార్కెట్లకు మామిడిపండ్లు రాని పరిస్థితి నెలకొన్నది. ఈ సమయానికి మామిడి రైతులు పండ్ల వ్యాపారంలో బిజీగా ఉండాలి. కానీ, పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

పచ్చడి కాయలు ప్రియం..

మామిడి పండ్ల సంగతి ఇలా ఉంటే.. పచ్చడికాయలు మరింత ప్రియం కానున్నాయి. మార్చిలో పూత రాలిపోవడంతో పచ్చడి మామి డి కాయలు ఆశించిన స్థాయిలో మార్కెట్లోకి రాలేదు. దీంతో ఈ ఏడాది మామిడి పచ్చళ్లు పెట్టుకోవడం కూడా ఆలస్యం కానున్నది.

పూత రాలడంతో తగ్గనున్న దిగుబడి

సాధారణంగా పదేండ్ల వయసు దాటిన మామిడిచెట్టు సీజన్‌లో 1.20 క్వింటాళ్ల దిగుబడి ఇస్తది. ఎకరానికి 3.5 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఏప్రిల్ ఆఖరు, లేదా మే ప్రారంభంలో కాయ కోతకు వస్తుంది. కానీ, ఈ ఏడాది పూత వచ్చే సమయానికి ఎండలు ముదిరాయి. దాంతో పూత రాలి నిరుడితో పోలిస్తే దిగుబడి తగ్గే అవకాశం ఉన్నదని ఉద్యాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్లకార్డు పట్టుకుని నిరసన తెలుపుతున్న వధూవరులు

తులం బంగారం ఏమైంది?

ప్లకార్డులతో వధూవరుల వినూత్న నిరసన

ఇచ్చోడ, ఏప్రిల్ 10 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో గురువారం నిర్వహించిన ఓ పెండ్లిలో వధూవరులు ప్లకార్డు పట్టుకుని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్లకార్డు ద్వారా కల్యాణలక్ష్మి పథకంలో ఇస్తానన్న తులం బంగారం ఏమైందంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెండ్లయిన ప్రతి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్నా ఇవ్వడంలేదని విమర్శిస్తూ నూతన వధూవరులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. పెండ్లి అయిన ప్రతి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని వధూవరులు కాంబ్లే ఆమోల్ – గీతాంజలి, వారి తల్లిదండ్రులు కోరారు.

అగ్నిమాపకశాఖకు ఫైర్ ఆడిటర్స్!

భవనాల పర్యవేక్షణతో పాటు నివేదికలు..వాటి ఆధారంగానే ఎన్‌వోసీల జారీ

రిక్రూట్ చేసుకునేందుకు ఎస్ఎఫ్ఏసీ ఆమోదం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): అగ్నిమాపక శాఖలో దేశవ్యాప్తంగా ఫైర్ ఆడిటర్స్‌ను నియమించుకునే వెసులుబాటును ఆయా రాష్ట్రాలకు అప్పగిస్తూ స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎస్ఎఫ్ఏసీ) సమావేశంలో తీర్మానించారు. షెరటన్ హోటల్‌లో కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఏసీ 45వ సమావేశం నిర్వహించారు. ఫైర్ ఆడిటర్స్ కావాలని ఆయిల్ ఇండస్ట్రీ సేఫ్టీ డైరెక్టరేట్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, భారత్ పెట్రోలియం, ఇండియన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కేంద్ర సంస్థల ప్రతినిధులతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అగ్నిమాపక విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు ప్రతిపాదించగా.. కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఫైర్ నాలెడ్జ్, విద్యార్హత, ప్రతిభ ఆధారంగా ఆన్‌లైన్ ద్వారా ఫైర్ ఆడిటర్స్‌ను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు భవనాలు, ఫైర్ ఫైటింగ్ వెసులుబాటు, వస్తు సామగ్రి వంటి అంశాలపై ఆడిట్ చేసి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఆ నివేదిక ఆధారంగా అగ్నిమాపకశాఖ అధికారులు 'ఎన్‌వోసీ' జారీ చేస్తారు.

16న ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ సభ్యుడు దాసోజు శ్రవణ్‌కుమార్ ఈనెల 16న ప్రమాణస్వీకారం చేయనున్నారు. మార్చి 30న ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఆయన ఎన్నికయ్యారు. 16న కౌన్సిల్ హాల్‌లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించనున్నారు.

స్త్రీనిధి ఎండీగా విద్యాసాగర్‌రెడ్డి!

- **నలుగురికి గోప్యంగా పోస్టింగులిచ్చిన ప్రభుత్వం**

హైదరాబాద్, ఏప్రిల్10(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీగా ఎన్‌వీఎస్‌రెడ్డిని తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కారు, గురువారం మరో నలుగురిని ప్రభుత్వ రంగ సంస్థలకు ఎండీలుగా నియమించినట్టు సమాచారం. స్త్రీనిధి ఎండీగా విద్యాసాగర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఎన్‌సీగా కనకరత్నం, మిషన్ భగీరథ ఈఎన్‌సీగా కృపాకర్ రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా గణపతిరెడ్డికి పోస్టింగ్ ఇచ్చినట్టు తెలిసింది. అయితే ఈ ఉత్తర్వులను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. గతంలో అవినీతి ఆరోపణలు వచ్చిన చోటే, మళ్లీ బాస్‌లుగా నియమిస్తూ పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

హై సెక్యూరిటీ ప్లేట్ ఇలా తీసుకోండి

- **ఆన్‌లైన్‌లో ఈజీగా బుక్ చేసుకోవచ్చు**
- **ఇక నుంచి 2019 ఏప్రిల్ 1కి ముందు తయారైన వాహనాలకూ తప్పనిసరి**
- **ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు**
- **హెచ్ఎస్ఆర్పీ లేకుండా రోడ్లపైకి వస్తే చర్యలే: రవాణాశాఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉన్న కొత్త, పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్(హెచ్ఎస్ఆర్పీ) ఉండాలనే నిబంధనతో కొందరు వాహనాదారుల్లో గుబులు మొదలైంది. ఇప్పటివరకు 2019 ఏప్రిల్ 1 తర్వాత తయారైన వాహనాలకు మాత్రమే ఈ నిబంధన అమలులో ఉండగా, ఇక నుంచి అంతకు ముందు తయారైన వాహనాలకూ ఏర్పాటుచేసుకోవాలని ఆదేశిస్తూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు సైతం ఇచ్చింది. ఫిట్‌నెస్ టెస్టు సహా.. వాహనాలకు సంబంధించి రవాణాశాఖ ద్వారా ఏ సేవ పొందాలన్నా ఈ నంబర్ ప్లేట్ ఉంటేనే సాధ్యమని, ఆ నంబర్ ప్లేటు లేని వాహనాలకు రవాణాశాఖలో ఎలాంటి సేవలు అందబోవని, ఇన్సూరెన్స్ చేయడం కూడా కుదరదని తేల్చి చెప్పింది. ఇక ఆ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్డు ఎక్కితే జరిమానాతోపాటు బండ్లను సీజ్ చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో హెచ్ఎస్ఆర్పీ ఎలా తీసుకోవాలో తెలియక కొందరు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే, వాహనదారులు www.siam.in వెబ్‌సైట్‌లో ఈ హెచ్ఆర్పీని సులువుగా పొందవచ్చు. మీరు ఎంచుకున్న తేదీలో మీకు నచ్చిన డీలర్ దగ్గర సెప్టెంబర్ 30లోపు ఫిట్టింగ్ చేయించుకోవచ్చు.

హెచ్ఎస్ఆర్పీ కోసం ఇలా చేయాలి..

- హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) కావాలనుకున్న వాళ్లు ముందుగా https://www.siam.in వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.
- పైన కనిపించే 'బుక్ హెచ్ఎస్ఆర్పీ'పైన క్లిక్ చేయాలి.
- ఆ తర్వాత ప్రత్యేకంగా విండో ఓపెన్ అవుతుంది.
- అందులో పుల్‌నేమ్, వాహన నంబర్, ఈ మెయిల్, మొబైల్ నంబర్, రాష్ట్రం, జిల్లా వంటివి ఎంటర్ చేసి నిబంధనలపై క్లిక్ చేసి సబ్మిట్ చేయాలి.
- ఆ తర్వాత మీ వాహనం టైప్(టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్, బస్, ట్రక్, కమర్షియల్ వాహనం) సెలెక్ట్ చేసుకోవాలి.
- ఆ తర్వాత కింద కనిపించే మీ వాహన కంపెనీని సెలెక్ట్ చేసుకోవాలి.
- ఇక్కడ ప్రత్యేకంగా మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో మీకు కావల్సిన 'హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ విత్ కలర్ స్టిక్కర్' అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- ఇందులో స్టెప్–1 బుకింగ్ డిటెయిల్స్, స్టెప్–2 ఫిట్‌మెంట్ లొకేషన్, స్టెప్–3 అపాయింట్‌మెంట్ స్లాట్, స్టెప్–4 బుకింగ్ సమ్మరీ, స్టెప్–5 వెరిఫై డిటెయిల్స్ అండ్ పే, స్టెప్–6 డౌన్‌లోడ్ రిసిప్ట్ వరకు అన్నింటినీ క్షుణ్ణంగా పూర్తిచేయాలి.
- స్టెప్–1లో వాహన నంబర్, ఫ్రేమ్/చాసిస్ నంబర్‌లోని చివరి ఐదు నంబర్లు, ఇంజిన్ నంబర్‌లోని చివరి ఐదు నంబర్లు ఎంటర్ చేసి క్యాప్చా నంబర్ ఎంటర్ చేయాలి.
- ఆ తర్వాత మీకు అందుబాటులో ఉన్న డేట్, టైమ్‌ను ఎంపిక చేసుకోవాలి.
- ఆ తర్వాత మీకు అందుబాటులో ఉన్న ఫిట్‌మెంట్ లొకేషన్‌లో సర్వీస్ సెంటర్‌ను ఎంచుకోవాలి. అక్కడే మీకు వాహన ప్లేట్‌కు ఖర్చు ఎంత అవుతుందో కనిపిస్తుంది.
- దానిని ఎంచుకుంటే బుకింగ్ సమ్మరీ కనిపిస్తుంది. దానిని వెరిఫై చేసుకొని పేమెంట్‌కు వెళ్లొచ్చు. అక్కడ క్రెడిట్, డెబిట్, యూపీఐ, నెట్ బ్యాకింగ్ ఆప్షన్లలో ఏదైనా ఎంచుకోవచ్చు.
- డబ్బులు చెల్లించిన తర్వాత వివరాలు చెక్ చేసుకొని అప్లికేషన్ ప్రింట్ తీసుకోవచ్చు. సంబంధిత సర్వీస్ సెంటర్ వివరాలు, ఫోన్ నంబర్ ఉంటాయి.
- అపాయింట్‌మెంట్ రోజు ఆర్సీ కాపీని వెంట తీసుకెళ్లాలి.
- ఆ స్లిప్ వ్యాలిడిటీ 28 రోజుల వరకు మాత్రమే ఉంటుంది.
- ఫిట్‌మెంట్‌కు ఎక్స్‌ట్రా నగదు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఏవైనా అభ్యంతరాలుంటే 8929722201 నంబర్, మెయిల్ online@bookmyhsrp.comలో సంప్రదించవచ్చు.



షకీల్‌ను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్ట్

- **శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

బోధన్/హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను ఓ పాత కేసులో పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు షకీల్ వస్తున్నట్టు తెలుసుకున్న పోలీసులు ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా దుబాయ్‌లో ఉంటున్న షకీల్.. తల్లి మరణవార్త తెలుసుకొని హైదరాబాద్ రాగా అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పోలీసులు అనుమతించారు. షకీల్ తల్లి షగుప్త ఆదిబ్ (78) బుధవారం కన్నుమూశారు. షగుప్త 2005లో హెచ్ఎంగా ఉద్యోగ విరమణచేశారు. బోధన్‌లో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ విభజన ఎట్లా?

- **ఎన్నికల్లో చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ**
- **అధికారంలోకి వచ్చాక హామీలు బుట్టదాఖలు**
- **తాజాగా 3 గ్రూపులుగా షెడ్యూల్ కులాల వర్గీకరణ**
- **కార్పొరేషన్ల విభజనపై ఇప్పుడు సందిగ్ధం**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): "మూడు ఎస్సీ కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తాం.. ఏటా రూ.750 కోట్ల కేటాయిస్తాం.." ఇదీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌లో ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ప్రధాన అంశం. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దానికి విరుద్ధంగా కేవలం మాల, మాదిగ కార్పొరేషన్లనే ఏర్పాటు చేయాలని ఉత్తర్వులను జారీ చేసి చేతులు దులుపుకున్నది. అయినా ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఎంబీఎస్సీ కులాలను వేరుగానే గుర్తిస్తామని, ప్రత్యేక కార్పొషన్‌ను ఏర్పాటు చేస్తామన్న చేవెళ్ల డిక్లరేషన్ హామీని ఇప్పుడు ప్రభుత్వం అటకెక్కించింది.

మూడు తరగతులుగా వర్గీకరణ

రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో 52,17,684 మంది ఎస్సీ జనాభాగా ప్రభుత్వం నిర్ధారించింది. రాష్ట్రంలోని 59 షెడ్యూల్ కులాలను 3 గ్రూపులుగా విభజించింది. అత్యంత వెనుకబడ్డ ఎస్సీ కులాలకు కాకుండా మళ్లీ బలమైన ఎస్సీ కులాలకే అధిక శాతం రిజర్వేషన్లు ఇచ్చి పట్టం కట్టారని, రిజర్వేషన్ శాతాన్ని పెంచకుండా, 2000–2004 వరకు అమలైన వాటినే ఇప్పుడూ కొనసాగిస్తున్నారని 57 ఎంబీఎస్సీ కులాలు దుయ్యబడుతున్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఉత్తముచ్చటే!

తెలంగాణ షెడ్యూల్డ్ కులాల కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేకమైంది. షెడ్యూల్డ్ కులాలన్నింటికీ సబ్సిడీ రుణాలను, వ్యవసాయాభివృద్ధి తదితర పథకాలను, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన దళితబంధు పథకాన్ని కూడా ఈ ఎస్సీ కార్పొరేషన్ ద్వారానే క్షేత్రస్థాయిలో అమలు చేశారు. ఎస్సీ వర్గీకరణలోనూ మాల, మాల ఉపకులాలు, మాదిగ, మాదిగ ఉపకులాలు, ఇతర ఎస్సీ కులాలు అంటూ విభజించింది. ఎంబీఎస్సీ కులాలను ప్రత్యేకంగా గుర్తించలేదు. ఎంబీఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు పూర్తిగా ప్రశ్నార్థకంగానే మారింది.

57 కులాలకు మరో కార్పొరేషన్ ఉండాల్సిందే

మాల, మాదిగ కార్పొరేషన్లతో 57 కులాలను కలిపితే ఊరుకునేది లేదు. 57 ఎంబీఎస్సీ కులాలకు మరో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గత ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్ వల్ల మాల, మాదిగకులాలే పూర్తిగా లబ్ధిపొందాయి. ఇతర వెనకబడిన 57 ఎస్సీ కులాలు తీవ్రంగా నష్టపోయాయి. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అనేక పోరాటాలు చేశాం. ఆ మేరకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు విస్మరించడం దారుణం. ఇప్పటికైనా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

- బైరి వెంకటేశం, 57 ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

జీపీవోల నియామకంపై గందరగోళం

ఆప్షన్లకు దూరంగా ఉండాలని వీఆర్‌వోలు, వీఆర్ఏలు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): గ్రామ పాలన అధికారుల(జీపీవో) నియామకంపై గందరగోళం కొనసాగుతున్నది. పూర్వ వీఆర్‌వోలు, వీఆర్ఏలను తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 16 వరకు ఆప్షన్లు తీసుకుంటామని చెప్పింది. అయితే.. ప్రమోషన్లపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన కొనసాగుతున్నది. దీంతో ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు ఆప్షన్లకు దూరంగా ఉండాలని మెజారిటీ వీఆర్‌వోలు, వీఆర్ఏలు నిర్ణయించినట్టు తెలిసింది.

ఉద్యోగుల సందేహాలు..

- జీపీవోలుగా నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నా.. అది ఏ క్యాడర్ పోస్టు అనే అంశంపై స్పష్టత లేదు.
- జీపీవో తర్వాత ప్రమోషన్ కల్పిస్తారా? లేదా..? అనే అంశంపై రెవెన్యూ సంఘాల నాయకులకే వివరాలు తెలియవు. జీవితకాలం ఒకే పోస్టులో ఉండిపోవాల్సి వస్తుందనేది ఉద్యోగుల ఆందోళన.
- ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసిన వీఆర్‌వోలు, వీఆర్ఏలు వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం జీపీవో తర్వాత ఆర్ఐ లేదా జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ కల్పిస్తే మళ్లీ అదే క్యాడర్‌లో పని చేయాల్సి వస్తుందని, ప్రమోషన్ ఇచ్చినట్టు ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు.
- ప్రస్తుతం ఇతర శాఖల్లో అందుకుంటున్న వేతనాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అంటే జూనియ ర్ అసిస్టెంట్‌గా ఉన్న వారికి అదే వేత నం కొనసాగనున్నది. ఒకవేళ వారికి జీపీవో నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇస్తే.. వేతనం ఎలా పెంచుతారని చర్చ జరుగుతున్నది.
- పరీక్ష నిర్వహించి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటివరకు సిలబస్‌పై స్పష్టత లేదు.

యూనివర్సిటీల్లో అధ్యాపకులేరి?

- **నిలిచిపోయిన పరిశోధనలు, కుంటుపడుతున్న విద్యా బోధన**
- **అందుబాటులోలేని గైడ్లు, 20 శాతానికి పడిపోయిన రీసెర్చ్**
- **ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రొఫెసర్లు, విద్యావేత్తలు**
- **సర్కారు ఆదేశాల కోసం నిరీక్షిస్తున్న ఉన్నత విద్యామండలి**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలు.. కాంగ్రెస్ పాలనలో తీవ్రమైన దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రతిష్ఠాత్మక ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మాగాంధీ, తెలంగాణ, శాతవాహన, జేఎన్‌టీయూ వంటి స్టేట్ యూనివర్సిటీలలో ప్రమాణాలు పడిపోయాయి. పట్టించుకునేనాథులు లేకపోవడం వల్ల ఆయా వర్సిటీలు విలవిల్లాడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు.

పరిశోధనలను పట్టించుకునేదెవరు?

సరిపడా అధ్యాపకులు ఉన్నకాలంలో ఆయా యూనివర్సిటీలలో గరిష్టంగా 70 శాతం వరకు పరిశోధనలు జరిగేవి. పరిశోధనాపత్రాలు కూడా సకాలంలో దాఖలు చేసేవారు. ఇప్పుడు పరిశోధనలు 20 శాతానికి పడిపోయినట్టు సీనియర్ ప్రొఫెసర్లు చెప్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఆందోళన వ్యక్తంచేశారు. వర్సిటీలో బోధన కుంటుపడిందని సీనియర్ ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో కలిపి 2,816 పోస్టులు ఉండగా.. వాటిలో ప్రస్తుతం 2,059 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ప్రొఫెసర్ పోస్టులతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

సాంకేతిక సమస్యల్లేవు.. సర్కారే చెప్పాలి!

యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సాంకేతిక పరంగా ఎలాంటి సమ్యలు లేవు. వాటిని తక్షణమే భర్తీ చేసుకోవడానికి నోటిఫికేషన్ యూనివర్సిటీ వారిగా విడుదల చేసుకోవచ్చు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ పోస్టుల భర్తీ కోసం అనుమతి రావాల్సి ఉంది. అందుకోసం ఎదురుచూస్తున్నాం.

- ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, రాష్ట్రఉన్నత విద్యా మండలి చైర్మన్

ఆయుష్ పోస్టులకు అల్లోపతి అర్హతలు!

- **కాంట్రాక్టు ఫార్మాసిస్టులకు శాపంగా జీవో- 65**
- **రెగ్యులరైజ్ చేస్తారన్న ఆశతో 18 ఏండ్లుగా సేవలు**
- **కేసీఆర్ హయాంలో 37 వేల మంది రెగ్యులరైజ్**
- **ఆందోళనలో 337 మంది కాంట్రాక్టు ఫార్మాసిస్టులు**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): ఆయూష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ, హోమియోపతి)లో ఫార్మాసిస్టు ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గత మార్చి 28న తీసుకొచ్చిన జీవో–65 కాంట్రాక్టు ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టేదిగా మారింది. 18 ఏండ్లుగా ఆయూష్‌లో పనిచేస్తున్న 337 మంది కాంట్రాక్టు ఫార్మాసిస్టులను కాదని ఈ ఉద్యోగానికి అల్లోపతి(ఇంగ్లిష్ మెడిసిన్)లో డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఫార్మ–డీ చదివిన వారిని అర్హులుగా పేర్కొంటూ, ప్రభుత్వం జీవో జారీ చేయడం వివాదాస్పదమవుతున్నది. వీరిలో ఎంపికైన వారికి ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సును ప్రభుత్వ ఆయుర్వేద, యునాని, హోమియో కాలేజీల్లో ఇవ్వాలని నిర్ణయించింది. శిక్షణ సమయంలో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా తుది నియామకం ఉంటుందని తెలిపింది. అయితే, ఆయూష్‌తో ఎలాంటి సంబంధం లేకున్నా అల్లోపతి చదవిన వారిని ఫార్మాసిస్టులుగా నియమించేందుకు జీవో జారీ చేయడం ఏమిటని కాంట్రాక్టు ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇన్నేండ్ల అనుభవం ఉన్న తమనే రెగ్యులరైజ్ చేస్తే ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేస్తామని కాంట్రాక్టు ఫార్మాసిస్టులు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌లో 'ఆయూష్ డిప్లొమా ఇన్ ఫార్మాసిస్టు' కోర్సును కనీస విద్యార్హతగా పేర్కొన్నది. కాగా, రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలోనూ ఈ కోర్సు లేదు. ఆ కోర్సు చదివిన అభ్యర్థులు అసలే లేరు. అయినా ప్రభుత్వం 308 పోస్టుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోపాటు గత సంవత్సరం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి, నవంబర్‌లో పరీక్ష నిర్వహిస్తామని జాబ్ క్యాలెండర్‌లో తెలిపింది. అధికారుల నిర్వాకంతో రాష్ట్రంలో లేని కోర్సును అర్హతగా పేర్కొంటూ ప్రభుత్వం ఆయూష్‌లో పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం పట్ల నిరుద్యోగుల నుంచి నాడు ఆందోళన వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం ఆయూష్ ఫార్మాసిస్టు పోస్టులను మినహాయించి అల్లోపతిలో 633 ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి గత ఏడాది సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో 'ఆయూష్ డిప్లొమా ఇన్ ఫార్మాసిస్టు' నిబంధన పెట్టిన ప్రభుత్వమే తాజాగా అల్లోపతి చదివిన వారికి అవకాశం కల్పించడం ఏమిటని కాంట్రాక్టు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

హరీశ్‌రావు చొరవ చూపినా..

ఆయూష్‌లో ఫార్మాసిస్టు పోస్టుల భర్తీ కోసం ఆరు నెలల పాటు థియరీ, ఆరు నెలలు ప్రాక్టికల్ అనుభవంతో కూడిన ఇన్ సర్వీస్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి పరీక్ష నిర్వహించి శిక్షణ, సర్టిఫికెట్ జారీ చేసే నిబంధన మాత్రమే రాష్ట్రంలో అమలులో ఉన్నది. ఈ నేపథ్యంలో ఆయూష్ ఫార్మాసిస్టు పోస్టుకు రెండేండ్ల కాల వ్యవధి గ